ఈసారి మిగులు లేదు..

- సన్నబియ్యానికి సై..
- పోటీపడి తీసుకున్న లబ్ధిదారులు
- నేటితో ముగియనున్న ఏప్రిల్ కోటా బియ్యం
- ఇప్పటికే 90 శాతం బియ్యం పంపిణీ




సిరిసిల్లలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం(ఫైల్)

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)
రేషన్ లబ్ధిదారుల్లో దొడ్డు బియ్యం ఈసారి మిగులకుండా తీసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రతినెలా దొడ్డుబియ్యం పంపిణీ సమయంలో 4లక్షల 11వేల 751 కిలోల బియ్యం మిగిలిపోయేవి. ప్రభుత్వం సన్నబియ్యానికి శ్రీకారం చుట్టడంతో లబ్ధిదారులు పోటీపడి తీసుకున్నారు. జిల్లాలో 345 రేషన్‌దుకాణాల పరిధిలో 1,73,578 కార్డులు ఉన్నాయి. ఇందులో 1,54,678 కార్డుదారులు బియ్యాన్ని పొందారు. జిల్లాకు 32వేల 753 క్వింటాళ్ల సన్న బియ్యం లబ్ధిదారులకు సరఫరాచేయగా 30వేల 178 క్వింటాళ్ల బియ్యం తీసుకున్నారు. రేషన్ దుకాణాల వద్ద బారులుతీరి బియ్యం లబ్ధిదారులు పొందడంతో అదనంగా మూడు రోజుల గడువు కూడా పొడిగించారు. ప్రతినెలా 15వ తేది వరకు బియ్యం పంపిణీ జరిగేది. లబ్ధిదారుల ఆసక్తి చూసి 18సాయంత్రం వరకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రేషన్ బియ్యం పొందడంతో రికార్డు నెలకొంది. గతంలో ఎన్నడూ లేనంతగా 90శాతం వరకు ఇప్పటికే సన్నబియ్యం పొందారు. శుక్రవారంతో పూర్తిస్థాయి రేషన్ తీసుకుంటారని అంచనాలు వేస్తున్నారు. జిల్లాలో రేషన్ సన్నబియ్యం పంపిణీ ఏప్రిల్ 1న బీసీ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూలతో పాటు ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంలు పంపిణీ చేశారు. వీరితోపాటు వరుసగా కాంగ్రెస్ నాయకులు మండలాల్లో పంపిణీ చేయడంతో పాటు కలెక్టర్‌తో సహా పేదవారితో కలిసి వారి ఇళ్లలో సన్న బియ్యం భోజనం చేయడంతో జిల్లాలో సన్నబియ్యంపై ఆసక్తి పెరిగింది. సన్నబియ్యం కూడా నాణ్యతగానే రావడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తం అయింది. గతంలో దొడ్డు రకం బియ్యం నెమ్మదిగా పంపిణీ జరిగేది. ఈసారి పది రోజుల్లోనే చివరి దశకు చేరుకునే పరిస్థితి ఏర్పడింది. దొడ్డు బియ్యం సీజ్‌చేసి ఈ ఏప్రిల్ కోటా పూర్తిస్థాయిలో బియ్యం కోటాను జిల్లాకు అలాట్ చేశారు.

● జిల్లాలో 5,02,714 మంది లబ్ధిదారులు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రతినెలా 5,02,714 మంది లబ్ధిదారులకు 32,758 క్వింటాళ్ల వరకు బియ్యం సరఫరా చేస్తున్నారు. జిల్లాలో 1,73,578 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో అంత్యోదయ కార్డులు 13,754, ఆహార భద్రత కార్డులు 1,59,621 కార్డులు, అంత్యోదయ అన్న యోజన కార్డులు 203 ఉన్నాయి. వీటి పరిధిలో 5,02,714 మంది లబ్ధిదారులు ఉన్నారు. అంత్యోదయ లబ్ధిదారులు 37,184 మంది, ఆహారభద్రత లబ్ధిదారులు 4,65,324 మంది, అన్నయోజన లబ్ధిదారులు 206మంది ఉన్నారు. వీరికి సన్నబియ్యం 32,75,364 కిలోలు కేటాయించారు. ఇందులో ఈనెల 1,73,578 కార్డుదారుల్లో 1,54,678 కార్డుదారులు 30,17,899 కిలోల బియ్యాన్ని పొందారు.

● మిగులు లేదు...

గతంలో జిల్లాలో దొడ్డు బియ్యం పంపిణీ చేసే సమయంలో లబ్ధిదారులు ఆసక్తి చూపేవారు కాదు. సగం మంది.. మిగతా 8లో

● సన్నబియ్యం పొందిన కార్డుదారులు

మండలం	రేషన్‌షాపులు	కార్డులు	బియ్యం పొందిన కార్డుదారులు
బోయినపల్లి	25	11,911	9,742
చందుర్తి	19	10,912	9,359
గంభీరావుపేట	29	15,556	1,3193
ఇల్లంతకుంట	33	14,385	12,611
కోనరావుపేట	35	13,919	11,599
ముస్తాబాద్	29	14,417	12,250
రుద్రంగి	08	4,850	4,394
సిరిసిల్ల	49	26,782	25,800
తంగళ్లపల్లి	34	14,151	13,226
వీర్నపల్లి	09	4,208	3,618
వేములవాడ రూరల్	16	7441	6,214
వేములవాడ	30	19,392	17,795
ఎల్లారెడ్డిపేట	29	15,654	13,877
మొత్తం	345	173,578	1,54,678

జూన్‌లో వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు

- భీమన్న ఆలయంలో భక్తులకు దర్శనం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

7

భీమేశ్వర ఆలయాన్ని పరిశీలిస్తున్న శైలజారామయ్యర్, ఆది శ్రీనివాస్

ఓపెన్ స్కూల్ పరీక్షల్లో సీనియారిటీ ప్రకారం విధులు కేటాయించాలి

- టీఎస్ యూటీఎఫ్ నాయకులు
- అధికారులకు వినతిపత్రం

8

అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

క్రీస్తు బలిదానం.. గుడ్‌ఫ్రైడే

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)



శాంతి.. ప్రేమ.. కరుణామయుడిగా కీర్తించే ఏసుక్రీస్తును పాపుల రక్షణ కోసం శిలువనెక్కి రక్తం చిందించిన పవిత్ర రోజుగా గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు జరుపుకుంటారు. శుక్రవారం గుడ్ ఫ్రైడేగా జరుపుకోవడానికి రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా సిద్ధమయ్యారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలతో గడపడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. మూడురోజుల పాటు ప్రార్థనలు జరిపిన అనంతరం క్రీస్తు తిరిగి పునర్జన్మించారని ఈస్టర్ సండేగా జరుపుకుంటారు. గుడ్ ఫ్రైడే కంటే ముందు 40రోజుల పాటు క్రైస్తవులు విషాద రోజులుగా గడుపుతారు. ఉపవాస దీక్షలు పాటిస్తారు. ఈస్టర్ రోజు క్రీస్తు మళ్లీ ఉపవాసాలు ముగించి ప్రార్థనలు విందులు జరుపుకుంటారు. ఈస్టర్ సండేకు ముందు శనివారం రాత్రి చర్చిల్లో పెద్దపెద్ద కొవ్వొత్తులను వెలిగించి ఏసుక్రీస్తు తిరిగివచ్చిన సందర్భంగా పాటలు పాడి సంబరాలు జరుపుకుంటారు. కేకులు స్వీట్లు పంచుకుంటారు. గుడ్ ఫ్రైడే ముందు గురువారాన్ని లాస్ట్ సప్పర్ డేగా భావిస్తారు. ఆ రోజు రాత్రి క్రీస్తు తన శిష్యులతో కలిసి భోజనం స్వీకరిస్తాడని దాన్నే చివరి రాత్రి భోజనంగా కూడా పిలుస్తారు. ఏసుక్రీస్తు శిలువపై ఉండగా పలికిన ఏడు మాటలను ఎంతో పవిత్రమైనవిగా భావిస్తారు.

బీఆర్ఎస్ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం చలో వరంగల్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజాప్రతినిధులు, నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, అన్నివర్గాల ప్రజలు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, సిరిసిల్ల పట్టణ మహిళా అధ్యక్షురాలు బత్తుల వనజ, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, సెస్‌డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బుర్ర రాజు, జిల్లా గ్రంథాలయం మాజీ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, మాజీ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభ విజయవంతానికి బైక్ ర్యాలీ

వేములవాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పిలుపునిచ్చారు. సభ పోస్టర్‌ను గురువారం ఆయన వేములవాడలో ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులతో కలిసి వేములవాడ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించిన ఆయన మల్లారం రోడ్డు వద్ద బహిరంగ సభ వాల్‌రైటింగ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు ప్రతి ఒక్కరు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి క్రాంతికుమార్, మండల అధ్యక్షులు మల్యాల దేవయ్య, మ్యాకల ఎల్లయ్య, మల్యాల దేవయ్య, మాజీ కౌన్సిలర్లు విజయ్, మారం కుమార్, నరాల శేఖర్, సిరిగిరి చందు, నాయకులు రామతీర్థపు రాజు, నీలం శేఖర్, కొండ కనకయ్య, శ్రీకాంత్ గౌడ్, మ్యాకల రవి, మంతెన సంతోష్, ఈర్లపల్లి రాజు, గోపు పరశురాములు, కృపాల్, ఇస్మాయిల్, కమలాకర్‌రెడ్డి, పోతు అనిల్, పర్వేజ్, పట్టణ వార్డు ఇన్‌చార్జిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టంపై విస్తృత ప్రచారం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా - బోయినపల్లిలో అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

బోయినపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టంపై రైతులకు ప్రజలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. బోయినపల్లి మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులు, ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ, భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025పై రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో ఈనెల 17 నుంచి 29వ తేదీ వరకు ప్రతి మండలంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వివరించారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై భూ భారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూమి ట్రిబ్యునల్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చని, గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని స్పష్టం చేశారు. అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత కూడా సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టుకు వెళ్ళవచ్చని, దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డుల తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేస్తామని వెల్లడించారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మనిషికి ఆధార్ కార్డులాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని పేర్కొన్నారు. భూ భారతి చట్టం ప్రకారం ఏ సమస్యను ఎవరు..ఎన్ని రోజులలో పరిష్కరించాలి.. అది పరిష్కారం కాకుంటే ఎలా అప్పీల్‌కు వెళ్లాలని దానిపై స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసిందని, సీసీఎల్ఏకు వెళ్లే అవసరం లేకుండా జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారి, కలెక్టర్‌కు అధికారాలను అప్పగించిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. పీవోటీ, ఎల్‌టీఆర్, సీలింగ్ చట్టాల ఉల్లంఘనలు లేని దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేసే నాటి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, 100 రూపాయల అపరాధ రుసుం వసూలు చేసి సర్టిఫికెట్ జారీచేస్తారని, హక్కుల రికార్డులు వివరాలను నమోదు చేసి పాసు బుక్ జారీ చేస్తారని అన్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ఒకే రోజు ఉంటాయన్నారు. కొనుగోలు, దానం తనకా బదిలీ బాగా పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులు మారుకసలు చేసి పట్టాదార్ పాస్ పుస్తకం జారీచేస్తారని, స్లాట్ బుకింగ్, స్టాంప్ డ్యూటీ రిజిస్ట్రేషన్ న్యూట్రిషన్ ఫీజు చెల్లింపు అంటే నిర్ణీత తేదీల్లో చట్ట ప్రకారం సొంత దస్తావేజు రాసుకొని సమర్పించాల్సి ఉంటుందని, దస్తావేజుతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన తేదీ నుంచి భూమి పట్టం సమర్పించాలని తెలిపారు. వారసత్వం లేదా వీలు నామా ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసిల్దార్ విచారణ జరిపి హక్కుల రికార్డుల్లో మ్యూటేషన్ చేస్తారని, నిర్ణిత గడువులోగా పూర్తిచేయకుంటే ఆటోమేటిక్‌గా మ్యూటేషన్ జరుగుతుందన్నారు. భూమి హక్కు కలిగిన రైతులందరికీ ఫీజుతో పాస్ బుక్ జారీ చేస్తారని అన్నారు. అనంతరం పలువురి అనుమానాలు, సందేహాలు నివృత్తి చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, వేములవాడ, సిరిసిల్ల ఆర్డీవోలు రాజేశ్వర్, రాధాబాయి, తహసీల్దార్ నారాయణ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ భూపేష్ రైతులు, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలతో నేర నియంత్రణ

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్



సమావేశంలో మాటాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధికాజైస్వాల్

కోనరావుపేట ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామకమిటీలను నేరాల నియంత్రణ చేయడానికి ఏర్పాటు చేస్తున్నామని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాసంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ అన్నారు. కోనరావుపేట మండలం కనగర్తిలో మానేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి కేసుల్లో ఇరుక్కోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఒక్కసారి కేసులో ఇరుక్కుంటే ఎప్పటికీ కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాల్యవివాహాలు చేసుకున్న వారికి ఆరోగ్య సమస్యలతోపాటు, చేయించినవారికి, ప్రోత్సహించిన వారికి రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా ఉంటుందన్నారు. గ్రామాల్లో నేరనియంత్రణ కోసం అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో కమిటీలు వేయడం జరుగుతుందన్నారు. ఈ కమిటీలు ఇరుపక్షాలకు మధ్యవర్తిత్వంగా ఉంటాయన్నారు. జిల్లా కేంద్రంలో ఉచిత న్యాయసేవా కేంద్రం ఉందని, నిరుపేదలు సహాయాన్ని పొందవచ్చన్నారు. మహిళలు, ఎస్సీలు, దివ్యాంగులు, ఉచిత న్యాయ సేవా కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్ మాట్లాడుతూ సివిల్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే, కేసు కొట్టేయడంతో పాటు ఆ కేసుల్లో కోర్టుకు కట్టిన ఫీజు కూడా వాపస్ ఇవ్వబడుతుందన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగంచేసుకోవాలని అన్నారు.

లాడ్జీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- నాలుగు లాడ్జీలకు నోటీసులు జారీ
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు
- ఎస్పీ మహేశ్ బీ గితే


మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్ బీ గితే

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న లాడ్జీలలో తప్పకుండా సీసీ కెమెరాలుబిగించాలని ఎస్పీ మహేశ్ బీ గితే అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వేములవాడలోని 50 లాడ్జీలలో 10పోలీసు బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని నాలుగు లాడ్జీలకు నోటీసులు జారీచేశామన్నారు. నోటీసులు జారీచేసిన జాబితాలో వేములవాడలోని విఘ్నేశ్వర, దేవన్న, రేణుక, చిట్టిబాబు లాడ్జీలు ఉన్నాయన్నారు. లాడ్జీలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. లాడ్జీల్లో తరచుగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. నోటీసులు జారీచేసిన లాడ్జీలలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయకుంటే జరిమానాలు విధించి కేసులు నమోదుచేస్తామన్నారు. లాడ్జీల్లో బస కోసం వచ్చిన వారి ఆధార్‌కార్డులు, ఇతర ఐడెంటి కార్డులు తప్పకుండా తీసుకొని రికార్డుల నిర్వహణ చేయాలన్నారు. భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. కొత్తవారు, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీస్ వారికి సమాచారం అందివాలన్నారు.

రేషన్ షాపు తనిఖీ


రేషన్ షాపును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

తంగళ్లపల్లి, ఏప్రిల్ 17 ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రేషన్ షాపును అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం రేషన్‌షాప్‌ను అదనపు కలెక్టర్ సందర్శించి బియ్యం నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఈనెల నుంచి ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్న బియ్యం లబ్ధిదారులందరికి పంపిణీ చేశారా అని ఆరా తీశారు.

సీనియర్ సివిల్ జడ్జిగా అజయ్‌కుమార్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ సీనియర్ సివిల్ కోర్టు జడ్జిగా అజయ్‌కుమార్‌ను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు వేకేంట్‌గా ఉన్న వేములవాడకు మేడ్చల్, మల్కాజ్‌గిరి నుంచి బదిలీపై వచ్చారు.

యువ వికాసం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 17 ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసము పథకం దరఖాస్తుదారులకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. గురువారం తంగళ్ళపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో తంగళ్లపల్లి, పద్మనగర్ గ్రామాలకు చెందిన 225 మంది దరఖాస్తుదారులకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ జయంత్ కుమార్, జిల్లెల్ల ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ రంజిత్‌రెడ్డిలు దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను పరిశీలించి, ఇంటర్వ్యూ నిర్వహించగా, లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్ పరిశీలించారు.

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కార్మిక అధికారి నజీర్ అహ్మద్

వేములవాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటున్నందున కార్మికులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కార్మిక అధికారి నజీర్ అహ్మద్ అన్నారు. వేములవాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు గురువారం ఆయన చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ, ఇతర రంగాల్లో పనిచేసే కార్మికులు మధ్యాహ్నం 12గంటల వరకు విధులు ముగించుకునే విధంగా చూడాలన్నారు. ఏఐటీయూసీ, సిఐటియు నాయకులు కడారి రాములు, ఎల్లారెడ్డి, గుర్రం అశోక్, దేవరాజు, కోరెపు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ ద్వారానే తెలంగాణ రాష్ట్రం..

ముస్తాబాద్, ఏప్రిల్ 17 ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ ద్వారానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తోట ఆగయ్య మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంతగా వరంగల్‌లో రజతోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు, మాజీ ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గోపాల్ రావు, మాజీ సెస్ డైరెక్టర్ విజయరామారావు, కొమ్ము బాలయ్య, సర్వర్ పాషా, అన్వర్‌పాషా పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, చెవుల మల్లేశ్, శీలం స్వామి, మెంగని మనోహర్, జహంగీర్, కోడె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణకు దారితీసిన క్రికెట్ ఆట

● మాజీ కౌన్సిలర్‌తోపాటు కుమారుడిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ ఆట రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసిన సంఘటన సిరిసిల్లలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌లో ఇటీవల సెలవులు రావడంతో బాలలంతా కలిసి క్రికెట్ ఆడేందుకు క్రీడామైదానానికి వెళ్లారు. ఇందులో భాగంగా ఇరుజట్లు మైదానంలోకి క్రికెట్ ఆడేందుకు దిగాయి. ఇరువైపుల జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో భవన్ అనే బాలుడు రెండుసార్లు అవుట్ అయ్యాడు. దీంతో నన్నే అవుట్‌చేస్తావా, మా నాన్న రెండుసార్లు కౌన్సిలర్.. అంటూ ఆగ్రహంతో క్యాచ్‌పట్టిన భార్గవ్ అనే బాలుడిని బ్యాట్‌తో కొట్టాడు. దీంతో రెండు కుటుంబాల మధ్య వివాదానికి తెరలేపింది. క్రికెట్‌లో అవుట్ చేసిన బాలుడిపై దాడిచేయడంతో అతని స్నేహితులు వెంటనే అతని ఇంటికి వెళ్లి తల్లికి చెప్పారు. ఎందుకు కొట్టావంటూ బాలుడిని అడిగేందుకు వెళ్లిన తల్లిపై మాజీకౌన్సిలర్ దౌర్జన్యం చేయడమే కాకుండా దుర్భాషలా డారు. దీంతో బాధితురాలు అన్నల్‌దాస్ ఉష పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేసింది. ఈమేరకు మాజీకౌన్సిలర్ గుండ్లపల్లి పూర్ణచందర్, అతడి కుమారుడు భవన్‌పై అదేరోజు కేసు నమోదుచేశామని టౌన్ సీఐ కె కృష్ణ గురువారం తెలిపారు. ఇదిలా ఉంటే తమకు మాజీకౌన్సిలర్, అతని అనుచరులతో ప్రాణభయం ఉందని, ద్విచక్రవాహనాలతో తమ ఇంటిచుట్టూ చక్కర్లు కొడుతూ భయభ్రాంతులకు గురిచేస్తు న్నారని, తమకు రక్షణ కల్పించాలని బాలుడితల్లి ఉష వేడుకుంటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అట్రాసిటి కేసుపై డీఎస్పీ విచారణ

మల్యాల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై మండలంలోని ముత్యంపేటలో డీఎస్పీ రఘుచందర్ విచారణ జరిపారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్‌కు చెందిన తిప్పని కార్తిక్ అనే యువకుడు ముత్యంపేటకు చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తూ మంగళవారం యువతి ఇంటికి వచ్చి కులం పేరుతో దూషించాడు. దీంతో పోలీసులు బుధవారం యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. గురువారం డీఎస్పీ విచారణ జరిపి వివరాలు నమోదు చేసుకున్నారు. డీఎస్పీ వెంట ఎస్సై నరేశ్‌కుమార్ ఉన్నారు.

భక్తులతో అమర్యాదగా ప్రవర్తించడం సరికాదు

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం అధ్యక్షుడిగా తనకు తాను ప్రకటించుకున్న కార్యదర్శి సిరిమల్ల జయేందర్ భక్తులు, గురుస్వాములపట్ల అమర్యాదగా ప్రవర్తించడం సరికాదని భక్తులు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. లక్షలాది రూపాయలు చందాలు ఇచ్చిన భక్తులకు ఆలయంలో జరిగే ఉత్సవాలకు ఆహ్వానించకపోవడం బాధాకరం అన్నారు. ప్రశ్నించిన వారిని ఏదో విధంగా అవమానపరుస్తూ ఆలయానికి రాకుండా చేస్తున్నారని అయిత విజయ్‌కుమార్, గందె రాజు, యాద సతీష్, తదితరులు తెలిపారు.

వృద్ధులకు అండగా..

లయన్స్ క్లబ్ విజన్ కేర్ ఉచిత సేవలు

అవగాహన కల్పించి కంటి చికిత్సలు

10374 మందికి ఆపరేషన్లు, 63743 మందికి అద్దాలు



కంటి ఆపరేషన్‌కు వెళ్తున్న బాధితులు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కంటి చూపు లోపంతో కొట్టుమిట్టాడుతున్న వృద్ధులకు మేమున్నామని అండగా నిలుస్తోంది లయన్స్ క్లబ్ విజన్ కేర్. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లా కు చెందిన 23 మంది నేత్రవైద్య సహాయకులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మొదటి విడుతలో తెలంగాణ కంటి వెలుగులో పని చేశారు. కంటి వెలుగు పథకం లేకపోవడంతో బాధితుల నుంచి నేత్ర వైద్య సహాయకులకు పెద్ద ఎత్తున వినతులు వచ్చాయి. వీరికి కంటి చూపు కల్పించాలన్న భావన వారిలో వ్యక్తమైంది. నేత్ర వైద్య సహాయకులు వారిలో కంటిలో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320జీ వారిని సంప్రదించి పరిస్థితిని వివరించారు. వారు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

2021లో పూదరి దత్తాగౌడ్ నేతృత్వంలో లయన్స్ క్లబ్ విజన్ కేర్ స్థాపించారు.



వ్యవస్థాపక అధ్యక్షుడిగా దత్తాగౌడ్ లాభాపేక్ష లేకుండా అడుగులు ముందుకు వేశారు. వచ్చిన వినతులను పరిశీలించి ఆయా గ్రామాలకు వెళ్లి కంటి చికిత్సలు చేయించడం మొదలుపెట్టారు. లయన్స్ క్లబ్ సభ్యులు గ్రామాల్లో తిరుగుతూ కంటి చికిత్సలపై విస్తృత స్థాయిలో అవగా హన కల్పించి చికిత్సలు చేయించుకు నేందుకు ప్రోత్స హించారు. గ్రామాలతో పాటు పట్టణాల్లో ఉచితవైద్య శిబిరాలు నిర్వహించారు. ఇప్పటి వరకు 2లక్షల13 వేల 567 మందికి పరీక్షలు చేయించారు.

సుమారు 10 వేల 374 మందికి కంటి ఆపరేషన్లు చేయించారు. అద్దాలు, మందులు అందేలా చర్యలు తీసుకున్నారు. కంటి శస్త్ర చికిత్స అందించే వారితో పాటు వచ్చే సహా యకులకు ఉచిత రవాణా, భోజన వస తులు కల్పించారు. లయన్స్ కంటి ఆసుపత్రి రేకుర్తి, చల్మెడ ఆనంద రావు ఆసుపత్రి, బెల్లం పల్లి పుష్పగిరి కంటి ఆసుపత్రిల సహకా రంతో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిం చారు. ఈ ఆపరేషన్లకు డిస్ట్రిక్ట్ బ్లైండ్నెస్ కంట్రోల్ సొసైటీ ద్వారా ఒక్కో ఆపరేషన్‌కు 2 వేల రూపాయలు చెల్లిస్తోంది. ఈ డబ్బులు రవాణా, భోజన సౌకర్యాల ఖర్చులకు సరిపో తుంది. ఒక్క ఆపరేషన్ బయట చేయించుకోవాలంటే సుమారు 20 వేల రూపాయలు ఖర్చు అవుతుందని వారు పేర్కొంటున్నారు. దాతల సహకారంతో 63 వేల 743 మందికి అద్దాలు అందజేశారు. ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి అవుట్ సోర్సింగ్ లేదా రెగ్యులర్ అసిస్టెంట్ అప్తామాలిక్ పోస్టులుగా గుర్తించి ఉపాధి కల్పిస్తే మరింత సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొంటున్నారు.

లయన్ సభ్యులు పూదరి దత్తాగౌడ్, అలీ అహ్మద్, పెర్క పృథ్వి రాజ్, సయ్యద్ ఇలియాస్ పరకాల, దామ లావణ్య, ముబీన్, బొగే సాయి నిఖిల్, అబ్దుల్ వాసే, బోడ రమేష్, షాకీర్, ఆసిమ్, బుద్దార్తి సతీష్ కుమార్, ఆకుల మల్లేష్, మాదర్‌ఖాన్, అలీం లయన్స్ క్లబ్ విజన్ సెంటర్ల ద్వారా ఉచితంగా పరీక్షలు చేసి దాతల సహాయంతో ఆపరేషన్లు చేస్తూ అద్దాలు, మందులు అందజేస్తున్నారు.

పేద ప్రజలకు కంటివైద్యం అందించడమే లక్ష్యం

పూదరిదత్తాగౌడ్, లయన్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు



నిరుపేద ప్రజలకు కంటి వైద్యం అందించడమే లక్ష్యంగా లయన్ విజన్ కేర్ పని చేస్తుంది. ఇప్పటికి వరకు లక్షలాది మందికి పరీక్షలు చేసి వేల మందికి ఆపరేషన్లు చేసి అద్దాలు అందజేశాం.

5వేలకు పైగా ఆపరేషన్లు

చిదుర రమేష్, రేకుర్తి కంటి ఆస్పత్రి వైస్ చైర్మెన్



రేకుర్తి ఆస్పత్రిలో లయన్ విజన్ కేర్ ద్వారా 5 వేల మందికి పైగా ఆపరేషన్లు చేశాం. ప్రభుత్వం రోగు లకు ఇస్తున్న రెండువేల రూపా యలతో రవాణా, భోజన సౌకర్యం కల్పించాం. నెల రోజులకు సరిపడా మందులు అందజేశాం.

పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్ చేశారు

భూదమ్మ మంథని



పైసా ఖర్చు లేకుండా బస్సులో తీసుకెళ్లి పరీక్షలు చేసి ఆపరేషన్ చేసి అద్దాలు, మందులు ఇచ్చారు. ఇప్పుడు కండ్లు మస్క లేకుండా కనిపిస్తున్నాయి,

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య


శ్యామల (ఫైల్)

మానకొండూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన మార శ్యామల(38) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గంగిపల్లికి చెందిన యాదగిరితో 26ఏళ్ల క్రితం శ్యామల వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె జన్మించగా కుమార్తెకు ఇటీవల అప్పుచేసి వివాహం జరిపించారు. తన భర్త యాదగిరి దుబాయి వెళ్లగా కొంతకాలంగా శ్యామల అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆసుపత్రులలో చూపించిన నయం కాలేదు. జీవితంపై విరక్తి చెందిన ఆమె బుధవారం రాత్రి ఇంటిలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న భర్త యాదగిరి గురువారం స్వగ్రామానికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. శవపంచనామా నిర్వహించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి

కోరుట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మల్లాపూర్ మండలం కుస్తాపూర్ గ్రామానికి చెందిన నీరేటి ముత్తయ్య (60) అనే వ్యక్తి మృతి చెందాడు. ముత్తన్న కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి డయాలసిస్ చేసుకోవడానికి గురువారం మధ్యాహ్నం వచ్చాడు. చికిత్స నిర్వహిస్తున్న సమయంలో ముత్తయ్య మృతి చెందాడు. ముత్తన్న మృతికి వైద్యులు కారణమంటూ మృతుడి బంధువులు నిలదీసారు. ముత్తన్న మృతిపై అనుమానం ఉందని ఆందోళనచేసేందుకు సిద్దంమయ్యారు. గమనించిన స్థానికులు కోరుట్ల పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలంకు చేరుకోన్న ఎస్ఐ శ్రీకాంత్ మృత్తన్న కుటుంబసభ్యులు, బంధువులను సముదాయించారు. ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేయించి రిపోర్ట్ ఆదారంగా ఆసుపత్రి వర్గాలపై కేసునమోదు చేస్తామని తెలిపారు. కాగా ముత్తయ్య కుస్తాపూర్ గ్రామం నుంచి మధ్యాహం ద్విచక్ర వాహనంపై ఎండలో వచ్చాడని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ముత్తయ్య ఎండ వేడికి మృతి చెందాడో... లేక మరే ఇతర కారణంతో మృతి చెందాడన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్స్


జమ్మికుంటకు వెళ్లే మూలమలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మానకొండూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలోని రెండు మూలమలుపులు, రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉంది. తూర్పుదర్వాజ బస్టాండ్ మూలమలుపు వద్ద 20ఏళ్ల క్రితం అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కరీంనగర్ నుంచి జమ్మికుంట ప్రధానరహదారి మానకొండూర్ తూర్పుదర్వాజ బస్టాండ్ మీదుగా ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర వాహనాలు నిత్యం వెళుతుంటాయి. కరీంనగర్ నుంచి జమ్మికుంట వైపు తిరిగే మూలమలుపు వద్ద గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. డ్రైవర్ ఆదమరిస్తే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనాల్సిందే. జమ్మికుంట వైపు వెళ్లే ప్రయాణికులు నిలబడడానికి అక్కడ స్థలమే లేదు. ప్రయాణికులు వేరే స్థలంలో ఉండి బస్సు వచ్చే సమయంలో పరుగులు తీసి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఇక్కడ అనేకప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాతపడ్డారు. ప్రస్తుతం ఇదే బస్టాండ్‌వద్ద జమ్మికుంట నుంచి కరీంనగర్ వెళ్లే మూలమలుపు వద్ద విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు గద్దెను నిర్మిస్తున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంపై గ్రామస్థులు, ప్రయాణికులు వ్యతిరేకిస్తున్నారు. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ గద్దె నిర్మాణం చేపట్టవద్దని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై మానకొండూర్ విద్యుత్ ఏఈ ఆర్ సత్యనారాయణను వివరణ కోరగా పాతట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు పడుతోందని స్థలం లేకపోవడంతోనే మూలమలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

బీఆర్ఎస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు



వెంకటాపూర్ వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేటలో పోలీసులు అక్రమ అరెస్ట్ చేసిన నాయకులకు సంఘీభావం తెలపడం కోసం వెళుతున్న ఎల్లారెడ్డిపేట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డిలను మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో గురువారం పోలీసులు అడ్డుకున్నారు. గంభీరావుపేటలో నెలకొన్న ప్రోటోకాల్ వివాదంలో బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారని పేర్కొంటూ అక్కడి పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారనే సమాచారంతో బయలుదేరి వెళ్లారు. దాంతో వెంకటాపూర్ గ్రామ శివారులో నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. తమ నాయకులకు సంఘీభావం తెలిపేందుకు బయలుదేరితే పోలీసులు అడ్డుకోవడం అన్యాయమని నాయకులు కృష్ణహరి, కృష్ణారెడ్డిలు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

● 23 మందికి గాయాలు
● డ్రైవర్ ఫోన్ మాట్లాడమే ప్రమాదానికి కారణం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం అప్పన్నపేట, అందుగులపల్లి మధ్య కరీంనగర్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న లారీని గురువారం సాయంత్రం ఢీకొంది. పెద్దపల్లి మండలం అప్పన్నపేట అందుగులపల్లి మధ్యలో రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్‌ను వన్‌వేకు మళ్లించారు. కరీంనగర్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న పల్లె వెలుగు టీఎస్ 02 యూబీ 9326, కరీంనగర్ వైపు వెళ్తున్న బూడిద లారీ టీఎస్ 22 0450 ఎదురెదురుగా ఢీకొన్నాయి. బస్సులో సుమారు 32మంది ప్రయాణికులున్నారు. ఈ సంఘటనలో 27మందికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108లో పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కండక్టర్ శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆస్పత్రి తరలించినట్లు తెలిసింది. అయితే డ్రైవర్‌నాగేందర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సు నడపడం వల్లే ఈప్రమాదం జరిగిందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఆస్పత్రిఆవరణ క్షతగాత్రులతో నిండి పోయింది. గాయాలైన వారిలో ఎర్రగొండ పావని, కీర్తన, ఎర్రగొండ ప్రేమలత, కోండ్రరాధ, అగాపెలిసా, చిరంజీవి, ఎనవాక మహాలక్ష్మి, తన్వీశ్రీ, మోక్షశ్రీ, శారద, సహస్ర, కొయ్యడ సంపత్, కొయ్యడ రజిత, కీర్తన, సౌజన్య, శోభ, వొల్లెపురాజమ్మ, అనిల్‌కుమార్, కాంపెల్లి సుజాత, మడుపు అనిత, సరిత, మోక్షిత్, వైష్ణవి, దీపిక, మనోజ్, ఎరుకల శోభ,ఆశానె,సృజన ఉన్నారు.ప్రమాదం జరిగినవెంటనే ఏసీపీ గజ్జికృష్ణ, ఎస్సైలు సీఐ, సిబ్బంది పంపించి సహాయక చర్యలు చేపట్టారు.


ఎదురెదురుగా ఢీకొన్న బస్సు, లారీ


గాయపడ్డ వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

● క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

గాయపడిన వారిని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను విచారణ చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. గాయ పడిన వారికి వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆర్ఎం భూపతిరెడ్డి, గోదా వరిఖని డీఎం నాగభూషణం పరామర్శించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఫ్లెక్సీ వివాదం

● ప్రారంభోత్సవ సమయంలో తోపులాట ● పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు

గంభీరావుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రంవద్ద ఫ్లెక్సీవిషయమై వివాదం నెలకొంది. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు మార్కెట్‌కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతితోపాటు పలువురు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, ఎంపీ బండి సంజయ్ ఫొటోలు లేవని నిర్వాహకులను ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మధ్య వాదోపవా దాలు పెరిగి, తోపులాటకు దారితీసింది. స్థానిక ఎస్ఐ ప్రేమానందం, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీస్‌సిబ్బంది జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇదిలా ఉండగా తమ పార్టీ నాయ కులపై కాంగ్రెస్ నాయ కులు దాడిచేశారని సిరిసిల్ల నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ముఖ్యనేతలు గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలి వచ్చారు. తమనాయ కులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కొనుగోలు కేంద్రం ప్రారంభాన్ని అడ్డుకుని, విధులకు ఆటంకం కలిగించారంటూ బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతలు సైతం ఫిర్యాదు చేశారు. రెండు పార్టీలనేతలు ఒకరిపై ఒకరు విమర్శిస్తూ పోలీస్‌స్టేషన్ వద్ద నినాదాలు చేసుకోవడంతో ఉద్రిక్తతగా మారింది.


కొనుగోలు కేంద్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

గంజాయి పట్టివేత

గంగాధరర,ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గట్టుబూత్కుర్‌లో గురువారం 68గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్ఐ వంశీక్రిష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గట్టుబూత్కుర్ గ్రామశివారు రైసుమిల్లులో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ముకేష్ వద్ద గంజాయి ఉన్నట్లు సమాచారం మేరకు తనిఖీ చేయగా గంజాయి లభించినట్లు ఆయన తెలిపారు. 68గ్రాముాలు గంజాయితో పట్టుబడిన ముకేష్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కల్ గ్రామంలోని మానేరు వాగునుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ఓనర్ ఈరవేణి శ్రీనివాస్, పూసల శంకర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

రైలు కింద పడి ఒకరి బలవన్మరణం

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని రైలుకింద పడి ఓ వృద్ధుడు గురువారం ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. హుజూరాబాద్ పట్టణంలోని మామిండ్లవాడకు చెందిన పొట్టబత్తిని సురేందర్(69) ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు తోడు కావడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గురువారం గుర్తుతెలియని రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

నిజాం దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన 'సింగిరెడ్డి' కుటుంబం

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

తంగళ్లపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నైజాం అరాచకాలు, దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కామ్రేడ్ సింగిరెడ్డి భూపతిరెడ్డి కుటుంబం నిలిచిందని సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటయోధుడు సింగిరెడ్డి భూపతిరెడ్డి కుమార్తె బద్దం సత్తవ్వ పది రోజుల క్రితం మృతిచెందగా గురువారం బాధిత కుటుంబ సభ్యులను చాడ వెంకటరెడ్డి, సీపీఐ నాయకులు పరామర్శించారు. బద్దం సత్తవ్వ చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాడు నైజాం అరాచకాలు, దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అన్నబేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డిలు సాయుధ దళాల నిర్మాణంచేపట్టి నైజాం, జమిందారులు, భూస్వాము లకు వ్యతిరేకంగా ప్రజలను పోరాటం దిక్కు నడిపించారని గుర్తుచేశారు. ఆ పోరాటానికి సింగిరెడ్డి భూపతిరెడ్డి కుటుంబం మొత్తం ఉద్యమానికి మద్దతును తెలియజేస్తూ నిజాం పోలీసుల దాడులను నిత్యం ఎదుర్కొంటూ ఇంటికి వచ్చిన దళాలు, దళనాయకులకు సహాయసహకారాలు అందించి ఉద్యమాన్ని కాపాడారన్నారు. పోలీసులు, నైజాంసర్కార్ దాడులకు వ్యతిరేకంగా నిలబడి చివరి వరకు ఎర్రజెండా పోరాటస్మృతులను, సింగిరెడ్డి భూపతిరెడ్డిచేసిన త్యాగాలను స్మరించుకుంటూ తండ్రి ఆశయాలకు అనుగుణంగా బద్దం సత్తవ్వ ముందుకు సాగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి గుంటివేణు, జిల్లా కార్యవర్గసభ్యులు మంద సుదర్శన్, మీసం లక్ష్మణ్, కడారి రాములు, అజ్జువేణు, సోమనాగరాజు, మంత్రి చంద్రయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్రరాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, నాయకులు

రెండు ఇళ్లలో చోరీ


విచారణ చేపట్టిన సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య

చందుర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థులకథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిర్రం రాజవ్వ, వెంగళ వినోద ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. చిర్రం రాజవ్వ ఇంటికి తాళంవేసి తన కుమారుడి ఇంటికి నిద్రిం చేందుకు వెళ్లింది. ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.15వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు తెలిపింది. ప్రశాంత్ అనే పాస్టర్ తన ఇంటిముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వినోద 25రోజులక్రితం హైదరాబాద్ వెళ్లి నందున వివరాలు తెలియవలసి ఉన్నది. ఈ సంఘటనపై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య విచారణ చేపట్టారు.

ఘనమైన వారసత్వ సంపద

- పట్టించుకోక శిథిలావస్థకు..
- దెబ్బతింటున్న పలు కట్టడాలు
- నేడు ప్రపంచ వారసత్వ దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి): భారతదేశం చారిత్రక, పౌరాణిక, ఇతిహాసిక, సాంస్కృతిక, నైతిక వారసత్వానికి వాసి గాంచిన నేల. దేశంలో ఎన్నో కట్టడాలు, చరిత్రలు, స్థలాలు, వస్తువులు మన దేశ, ప్రాంత వైభవాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నాయి. ఒక్కో రాష్ట్రానికి, జిల్లాకు ప్రత్యేక చరిత్ర, సంస్కృతి, శిల్ప సంపద ఉండగా అవన్నీ మనల్ని మంత్రముగ్ధుల్ని చేసి మరపురాని మధుర జ్ఞాపకాలుగా నిలుపుతాయి. ప్రతీ యేటా ఏప్రిల్ 18న అంతర్జాతీయ చారిత్రక కట్టడాల దినోత్సవంగా (ప్రపంచ వారసత్వ దినోత్సవం, వరల్డ్ హెరిటేజ్ డే) జరుపుకుంటారు. ఐక్య రాజ్య సమితిలోని సభ్య దేశాలు, అంతర్జాతీయ పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో వారసత్వ సంపద పరిరక్షణకు ఒకరికొకరు పలు అంశాలతో పరస్పరం సహకరించుకోవాలని ఆఫ్రికాలోని ట్యూనీషియాలో 1982, ఏప్రిల్ 18న సమావేశంలో ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రతిపాదనను యునెస్కోకు పంపగా ఏప్రిల్ 18ని ప్రపంచ వారసత్వ దినోత్సవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి వారసత్వ సంపద ప్రాధాన్యం తెలిపేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 800 పురాతన కట్టడాలు, స్థలాలను గుర్తించి పరిశీలన జరుపుతున్నారు.


ఎలంగందుల ఖిల్లా

ఉమ్మడి జిల్లాలో పలు కట్టడాలు

ఉమ్మడి జిల్లాలో పురాతత్వ వారసత్వ కట్టడాలు సుమారు 150 వరకు ఉండగా అందులో పురాతత్వ శాఖ గుర్తించిన ప్రదేశాలు, కట్టడాలు 50 నుంచి 60 వరకు ఉన్నాయి. 1850 నుంచి 1950 వరకు వివిధ ప్రదేశాలు, గ్రామాల్లో కట్టిన 350 బురుజులు ఉన్నాయి. మౌర్యులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, బాదామీ చాళుక్యులు, పశ్చిమ చాళుక్యులు, కాకతీయులు, వేములవాడ చాళుక్యులు, పొలవాస, విజయనగర రాజులు ఈ జిల్లా ప్రాంతానికి వచ్చినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అనంతరం బహమనీయులు, మొఘలాయీలు, కుతుబ్ షాహీలు, అసబ్‌జాయీలు వంటి ముస్లిం రాజులు ఈ నేలపై కాలు మోపారు. విస్తారమైన గోదావరి, మానేరు వంటి నదీతీరాలు వెలియడంతో మన కట్టడాల చరిత్ర మరింత విలసిల్లింది. కోటలు, ఆలయాలు, మసీదులు, చర్చిలు, రాజులు, మంత్రులు, జమీందారుల స్థావరాలు ప్రాచీన చరిత్రకు సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. ధూళికట్ట బౌద్ధ స్తూపం అమరావతి స్తూపం కంటే పురాతనమైనదిగా చెబుతారు. అది ప్రస్తుతం హీన దశకు చేరుకుంటోంది. జగిత్యాల, ఎలగందుల, మొలంగూరు లాంటి కోటలు శిథిలమవుతున్నాయి. ఐదు కోట్ల వ్యయంతో అప్పటి కేంద్ర మంత్రి చిరంజీవి, ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎలగందుల ఖిల్లాలో సౌండ్, లైటింగ్ షో ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాలు అనంతరం అది మూలన పడింది.


వేమువాడలోని భీమేశ్వరాలయంలోని జైన విగ్రహాలు

కోటి లింగాలలో తొలి శాతవాహన స్థావరం

కోటి లింగాలలో తొలి శాతవాహన స్థావరం 1975లో బయట పడగా గోదావరి నీరు ముంపునకు గురి కాకుండా రక్షణ గోడ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. చారిత్రక నేపథ్యం ఉన్న పొలాస ఆలయాలు శిథిలమవుతున్నాయి. వేములవాడ భీమేశ్వర ఆలయంలో సప్తమాతృకలు, లింగాలు, జైన విగ్రహాలు కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. సుమారు 1700 సంవత్సరాల కేదారీశ్వర ఆలయం, నగరేశ్వర దేవాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. కరీంనగర్ పాతబజార్ గౌరీశంకరాలయంలో రెండు జైన విగ్రహాలుండగా ఒకటి ధ్వంసం కాగా మరొకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. వేములవాడ చాళుక్యుల కాలం నాటి సిరిసిల్ల ఎల్లారెడ్డిపేట సమీ పంలోపి మూలవాగు పుట్టిన భీముని మల్లారెడ్డిపేట సీతారామ, ఆంజనేయ స్వామి ఆలయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. గోదావరి తీరంలోని మంథనిలో 25 ఆలయాలుండగా గౌతమేశ్వర స్వామి దేవాలయం కాకతీయుల కాలం నాటిది. నగునూరు, కొత్తపల్లి, బొమ్మలమ్మ గుట్ట దేవాలయాలు కూడా అభివృద్ధికి నోచుకోవాల్సిన అవసరం ఉంది. 1905లో ఎలందుల నుంచి కరీంనగర్‌కు జిల్లా తరలివచ్చిందని చెబుతారు. జిల్లా పర్యాటక అధికారిగా ఏడాదిగా ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్నారు


ఆదరణకు నోచుకోని కరీంనగర్ మ్యూజియం

కరీంనగర్‌లో అర్ధ శతాబ్దం క్రితం ఏర్పాటు చేసిన ప్రభుత్వ పురావస్తుశాఖ మ్యూజియం ఆదరణకు నోచుకోవడం లేదు. పట్టించుకునే వారు లేక శిథిలా వస్థకు చేరుకుంది. గోడలకు రంధ్రాలు ఉండడంతో విలువైన విగ్రహాలు, ఇతర వస్తువులకు భద్రత కరువైంది. పురావస్తు శాఖలో నిధు లు, సిబ్బంది కొరతతో ఈ మ్యూజి యం, కార్యాలయాల నిర్వహణ భారంగా మారింది. మ్యూజియం లోని ప్రదర్శనశాలలో ఇత్తడి, ఆదిమ జాతుల కాలం నాటి పాతరాతి యుగం ఆనవాళ్ళు, ప్రముఖ చరిత్రకారుడు ఠాకూర్ రాజారాంసింగ్ భద్రాచలం నుంచి బాసర వరకు తిరిగి సేకరించిన ఆదిమ మానవులు వాడిన రాతి పని ముట్లు, రెండు వేల సంవత్సరాల చరిత్ర గల శాతవాహనుల కాలం నాటి కోటి లింగాల బౌద్ధ స్తూప ఖండికలు ఉన్నాయి.


కరీంనగర్‌లోని మ్యూజియం


ఎలంగదుల ఖిల్లాలో మినార్‌లు


జగిత్యాల కోట


మొలంగూర్ ఖిల్లా

ఐఆర్‌సీటీసీ సమ్మర్ ప్యాకేజీ

- హైదరాబాద్ నుంచి భారత్ గౌరవ్ రైలు యాత్ర
- జనరల్ మేనేజర్ టూరిజం డీఎస్‌జీపీ కిషోర్



పెద్దపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి భారత్ గౌరవ్ రైలు యాత్ర సమ్మర్ స్పెషల్ ప్యాకేజీ అందుబాటులో ఉన్నాయని ఐఆర్‌సీటీసీ జనరల్ మేనేజర్ టూరిజం డీఎస్‌జీపీ కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ ద్వారా ఐఆర్‌సీటీసీ భారత గౌరవ టూర్ పేరుతో ప్రత్యేకంగా దేశంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను హైదరాబాద్ నుంచి ప్యాకేజీలు తయారు చేసిందని, వీటిలో ట్రైన్, బస్ జర్నీ, హోటల్, భోజన ఖర్చులు, గైడ్‌తో సహ సైట్ సీయింగ్ ఉంటాయని పేర్కొన్నారు. భార త గౌరవ టూర్‌లో భాగంగా హైదరాబాద్ నుంచి ఐదు ప్యాకేజీలలో ప్రత్యేక రైళ్లు ఉన్నాయని తెలిపారు.

- ఈనెల 23 నుంచి మే 2 వరకు 9 రాత్రులు, 10 రోజులలో హరిద్వార్, రిషికేష్ వైష్ణవ దేవి, ఆనంద్‌పూర్, నైనాదేవి, అమృత్‌సర్ పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. ప్రతీ ఒక్కరికి 18,150 రూపాయల ఖర్చు అవుతుంది.
- మే 8 నుంచి 17 వరకు 9 రాత్రులు, 10 రోజులలో వారణాసి, పూరి, గయా, అయోధ్య, ప్రయాగ్ రాజ్, కోణార్క్ పర్యాటక ప్రాంతాలను కవర్ కానుండగా, ఒక్కరికి 16,800 రూపాయల ఖర్చు అవుతుంది.
- మే 22 నుంచి 30 వరకు 8 రాత్రులు, 9 రోజులలో అరుణాచలం, రామేశ్వరం, తంజావూర్, కన్యాకుమారి, త్రివేండ్రం, త్రిచి, మధురై పర్యాటక ప్రాంతాలు కవర్ కానుండగా, ఒక్కరికి రూ.14,700 ఖర్చు అవుతుంది.
- జూన్ 4 నుంచి 12 వరకు 8 రాత్రులు, 9 రోజులలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోహం, నాగ్‌పూర్ పర్యాటక ప్రాంతాలు కవర్ కానుండగా, ఒక్కరికి 14,700 రూపాయల ఖర్చు అవుతుంది.

భారత గౌరవ టూర్‌లో పాల్గొనే వారు www.irctctourism.com వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా సికింద్రాబాద్ రోడ్డులోని ఐఆర్‌సిటిసి, మూడవ ఫ్లోర్, ఆక్స్‌ఫర్డ్ ప్లాజా, సికింద్రాబాద్‌లో బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 04027702407, 9701360701, 9281495845, 9281495843, 9281030750, 9281030740 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

నీరుకుళ్ల రంగనాయక స్వామి రథోత్సవం

సుల్తానాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల మానేటి రంగనాయక స్వామి రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం ముఖ్యమైనదిగా భావిస్తారు. ఈఓ శంకర్ ఆధ్వర్యంలో భక్తి గీతాలు, సంకీర్తనలు ఆలపించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. రథోత్సవంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సతీష్, పెద్దన్న శంకర్, అర్చకులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, రాజ్ కమారాచార్యులు, మాజీ సర్పంచ్ విజేందర్, పెరుమారెడ్డి పాల్గొన్నారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎస్సారార్‌లో షార్ట్ టర్మ్ బ్యూటీషియన్ కోర్సు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాలలో షార్ట్ బ్యూటీషియన్ కోర్సు అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట్ల రామకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్ సర్టిఫికెట్ కోర్సుతో వచ్చే సర్టిఫికెట్ ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చన్నారు. 25 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

మహిళా హక్కుల పరిరక్షణే లక్ష్యం

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



మహిళా హక్కుల పరిరక్షణ యాత్రలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మహిళా హక్కుల పరిరక్షణే లక్ష్యంగా, అంబేద్కర్, పూలే ఆశయాల సాధన దిశగా ఐద్వా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బస్సుయాత్ర చేపట్టినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర గురువారం కరీంనగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ చౌక్ వద్ద ఐద్వా కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మల్లు లక్ష్మి మాట్లాడారు. అంబేద్కర్, జ్యోతిబాపూలే ఆశయాల సాధన, మహిళా హక్కుల పరిరక్షణ కోసం అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం కృషి చేస్తుందన్నారు. మహిళలపై ఆగాయిత్యాలు జరగకుండా చట్టాలు కఠినతరం చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరిరక్షణ యాత్రకు, రైతు సంఘం మాజీ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం, రైతు సంఘం అధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సాగర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.తిరుపతి, నరేష్ పటేల్ సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణ జ్యోతి, రాష్ట్ర సహా య కార్యదర్శి కేఎన్ ఆశలత, నల్లిగంటి రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు

- భీమన్న ఆలయంలో భక్తులకు దర్శనం ● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణ పనులు జూన్ మాసంలో ప్రారంభించనున్న సందర్భంగా భక్తులకు అనుబంధ ఆలయ మైన భీమేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవదాయశాఖ కమిషనర్ శ్రీధర్, వీటీడీఏ వైస్‌చైర్మన్, సెక్రెటరీ, కలెక్టర్ సందీప్ కుమార్‌లతో కలిసి గురువారం రాజన్న ఆలయాన్ని సందర్శిం చారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయం ప్రాంగణం, ఆవరణ, ఆలయం ముందు భాగంతో పాటుగా శ్రీభీమేశ్వర స్వామివారి ఆలయాన్ని క్షేత్ర స్థాయిలో ఆలయ అభివృద్ధి నమూనాలతోపాటు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి వేముల వాడ దేవాలయ అభివృద్ధికి రూ.38 కోట్లు ప్రకటించారన్నారు. ఆగమ శాస్త్రం, వాస్తు అంశాలను దృష్టిలో పెటుకుని భక్తులకు ఇబ్బంది కలగకుండా పనులు చేపట్టాలని కార్యాచరణ రూ పొందిస్తున్నామన్నారు.


ఆలయ ప్రాంగణంలో ఆది శ్రీనివాస్, శైలజరామయ్యార్

శృంగేరి పీఠం అనుమతితో పనులు ప్రారంభిస్తాం ● శైలజరామయ్యార్

వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.76 కోట్లు, అన్నదాన సత్రానికి రూ.35 కోట్లు, రోడ్డు వెడల్పు పనులకు రూ.47 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. దేవాలయ అభివృద్ధితో పాటుగా పట్టణ అభివృద్ధి సమాంతరంగా జరగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. అన్న దాన సత్రం నిర్మాణ పనులుకు టెండర్ పూర్తి చేశామని తెలిపారు. శృంగేరి పీఠాధిపతుల అనుమతి, ఆశీర్వాదం తీసుకుని ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో స్థపతి వల్లినాయగం, ఆర్కిటెక్ట్ సత్యనారాయణ, ఈవో వినోద్‌రెడ్డి, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, ఆర్‌అం డ్‌బీ సీఈ బిల్డింగ్స్ రాజేశ్వర్‌రెడ్డి, సీఈ ఎలక్ట్రికల్ లింగారెడ్డి, ఎస్ఈ లక్ష్మణ్, జిల్లా ఈఈ వెంకట రమ ణయ్య, ప్రధాన అర్చకులు ఉమేష్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నమిలికొండ రాజేశ్వరశర్మ, శరత్‌శర్మ పాల్గొన్నారు.

రాజన్న సేవలో..

రాజన్న ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా సందర్శనకు వచ్చిన దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవదాయశాఖ కమిషనర్ శ్రీధర్, వీటీడీఏ వైస్ చైర్మన్, సెక్రెటరీ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాలకు స్వాగతం పలికారు.

రాజన్న ఆలయాభివృద్ధిపై సమీక్ష

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధిపై దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వివిధ శాఖల అధికారులతో కలిసి ఆలయ గెస్ట్‌హౌస్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అవసరమైన మార్గదర్శకాలు, అనుమతుల కోసం ఈ నెల 27వ తేదీన శృంగేరి పీఠం వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.76 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు భూసేకరణ పెండింగ్ లేదని, ఆలయ నిర్మాణ పనుల మానిటరింగ్ కమిటీని జూన్ నెలలో ఏర్పాటు చేయాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ధార్మిక సలహాదారులు గోవిందహరి, స్థపతి వల్లినాయగం, ఆర్కిటెక్ట్ సత్యనారాయణ, ఈవో వినోద్, ఈఈ రాజేష్, డీఈ రఘు నందన్, ఆర్‌అండ్‌బీ అధికారులు రాజేశ్వర్ రెడ్డి, లింగారెడ్డి, లక్ష్మణ్, వెంకట రమణయ్య, ప్రధాన అర్చకులు ఉమేష్‌శర్మ తదితరులు ఉన్నారు.


పొలం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

పంటచేనుపై మూడో కన్ను

- పొలం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసిన రైతు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దొంగలు పెట్రేగిపోతున్నారు. ఇళ్లు, ఆలయాలే కాకుండా వ్యవసాయ పొలాల వద్ద తమ చేతులకు పని చెబుతున్నారు. వ్యవసాయ సామగ్రిని కాపాడుకునేందుకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతు గన్న బాల్‌రెడ్డి దుమాల గ్రామశివారులోని తనకున్న పొలం వద్ద రూ.5వేలు వెచ్చించి విద్యుత్ స్తంభానికి సీసీ కెమెరా బిగించాడు. వర్షానికి తడవకుండా ఉండడంతో పాటు ఎవరికీ అనుమానం కలగకుండా కరెంటు స్తంభంపై ఓ ఖాళీ డబ్బాను సగం వరకు తొలగించి అందులో సీసీ కెమెరా ఏర్పాటు చేశాడు. గతంలో పొలం వద్ద నుంచి ఎరువుల సంచులు, పైపులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు రైతు బాల్‌రెడ్డి పేర్కొన్నాడు. సీసీ కెమెరాను బిగించడంతో చోరీలు తగ్గాయని చెబుతున్నాడు.

దాహం తీర్చని 'మిషన్ భగీరథ'

- గ్రామాల్లో పూర్తి కానీ పైప్ లైన్ పనులు ● పట్టించుకోని అధికారులు


జాగీర్‌పల్లిలో నీరు రాక నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ నల్లా

సైదాపూర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి మంచి నీరు ఇవ్వాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ప్రవేశ పెట్టింది. అధికారుల నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ నీరు ప్రజల దాహార్తిని తీర్చలేకపోతోంది. సైదాపూర్ మండలంలో ఏ గ్రామానికీ పూర్తి స్థాయిలో మిషన్ భగీరథ నీరు అందడం లేదు. వేసవి కాలం సమీపించడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి గ్రామాల్లో మంచి నీటి ఎద్దడి ఏర్పడే అవకాశముంది. మండలంలో ఏ గ్రామంలోనూ పూర్తి స్థాయిలో మిషన్ భగీరథ పనులు పూర్తి కాలేదు. కొన్ని గ్రామాల్లో ఇంటింటికి పైపులు వేసి నల్లాలు ఏర్పాటు చేశారు. కానీ ఆ పైప్‌లైన్‌కు నీటి కనక్షన్ ఇవ్వలేదు. దీంతో ఇంటి ముందు పేరుకే మిషన్ భగీరథ నల్ల ఉంది కానీ నీరు రావడం లేదని మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ బావుల నుంచి నీటి సరఫరా

సైదాపూర్ మండలం మెట్ట ప్రాంతం కావడం, చాలా రోజుల నుంచి వర్షాలు పడక పోవడం, ఎండలు ముదిరి ఉష్ణోగ్రతలు పెరగడంతో భుగర్భ జలాలు అడుగంటాయి. దీంతో గ్రామాల్లో నీటి ఎద్దడి ప్రారంభమైంది. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ఆయా గ్రామా పంచాయతీల ఆధ్వర్యంలో ప్రైవేట్ వ్యవసాయ బావుల నుంచి నీటిని కొనుగోలు చేసి గ్రామంలోకి సరఫరా చేస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీరు సరఫరా చేసి ప్రతీ ఇంటికి నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నీళ్లు రావడం లేదు
రాధారపు పద్మ, జాగీర్‌పల్లి



మిషన్ భగీరథ నీళ్లు వస్తాయని ఇంటి ముందు నల్లా పెట్టి ఐదేళ్లు గడిచాయి. ఇప్పటి వరకు ఒక్క బొట్టు నీళ్లు రాలే దు. పెద్ద సార్లు మాకు మిషన్ భగీరథ నీళ్లు వచ్చేలా చూడాలి.


వృథాగా మిషన్ భగీరథ నల్లా పైపు


సర్వాయిపేటలో గ్రామ పంచాయతీ కొనుగోలు చేసిన వ్యవసాయ బావి నుంచి నల్లాల బావికి పైపుల ద్వారా నింపుతున్న నీరు

25న దుకాణ సముదాయాలకు వేలంపాట

ఇల్లంతకుంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలోని గ్రామపంచాయితీ పరిధిలోని దుకాణ సముదాయాలను అద్దెకు ఇవ్వడానికి ఈనెల 17న బహిరంగ వేలం వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సంధ్య ఒక ప్రకటనలో పేర్కొంది. 23 చిన్న గదులకు రూ 50వేలు, ఏడు పెద్ద గదులకు రూ లక్ష ధర వాత్తును ఈనెల 24లోపు గ్రామపంచాయతీ కార్యాలయంలో చెల్లించాలని సూచించారు. అదే విధంగా వారసంతకు సైతం ఇదే రోజుల వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంవత్సరం పాటు కాంట్రాక్టు ఉంటుందని, గ్రామపంచాయతీ అధికారుల నిర్ణయమే తుది నిర్ణయం అన్నారు. అప్సెట్ ధర కంటే ఎక్కువ వచ్చేంత వరకు వేలంపాట కొనసాగుతుందన్నారు. వివరాలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న అధికారులు, నాయకులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో మాడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎంపీడీవో శశికళ గురువారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తొలివిడుతలో మండలానికి 803 ఇళ్ళు మంజూరయ్యాయని తెలిపారు. అర్హులైన వారి జాబితా సిద్ధంచేసి గ్రామ కమిటీలకు పంపామన్నారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బుల ద్వారా ఇంటిని నిర్మించుకోవచ్చన్నారు. అందులో భాగంగానే నమూన ఇంటి నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మండలపరిషత్ సిబ్బంది సూర్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం ఉన్నవారికే పనులు ఇవ్వాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ ప్లంబర్ అసోసియేషన్‌లో సభ్యత్వం ఉన్నవారికే ఇంటి యజమానులు పనులు ఇవ్వాలని అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల పట్టణ ప్లంబర్ అసోసియేషన్‌ను ఇటీవల ఏర్పాటు చేసుకున్నామని, కొందరు పనులు మధ్యలో వదిలిపెట్టి ఇంటి యజమానులను ఇబ్బందికి గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అసోసియేషన్ సభ్యుడై ఉంటే ప్లంబర్‌పై ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం దేవరాజు, ఉపాధ్యక్షుడు సలీం, కోశాధికారి జి ముకుందం, సభ్యులు ఎండీ రియాజ్, పి లింగం, పీ సురేష్, ఎస్ మురళి, షరీఫ్, చింతకుంట రవి, దేవదాస్ పాల్గొన్నారు.

తెర్లుమద్దిలో పశువైద్యశిబిరం

ముస్తాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తెర్లుమద్దిలో గురువారం పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. గేదేలకు, పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. పశువైద్యాధికారి డాక్టర్ అఖిల, బీఆర్ఎస్ నాయకుడు బైతి నవీన్, నాగుల శ్రీనివాస్, శ్రీకాంత్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రెడ్డి సంఘ అధ్యక్షుడు సన్మానం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డిని పెద్ద లింగాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు కేతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. పాశం రాజేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

మాజీ సర్పంచ్ కుటుంబీకులకు పరామర్శ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దలింగాపూర్ తొలి సర్పంచ్ కేతిరెడ్డి రాంరెడ్డి కుటుంబీకులను జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి గురువారం పరామర్శించారు. రాంరెడ్డి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఎగుమామిడి కృష్ణారెడ్డి, కంకణాల శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కృష్ణహరి, కేతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పాశం రాజేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, రమణారెడ్డి, రామచంద్రరెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల(పురుషుల) డిగ్రీ కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ వీర ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తును ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులన్నారు. అర్హులైన వెనుకబడిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వీర ప్రభాకర్ కోరారు.

● తంగళ్లపల్లి : మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల(సిరిసిల్ల)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన గిరిజన, గిరిజనేతర విద్యార్థినిలు కళాశాలలో అందుబాటులో ఉన్న గ్రూపులలో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ సాగుతోందని తెలిపారు. వివరాలకు 7995970016, 9985607074, 9550267058 సెల్ నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సి పాల్ ప్రకటనలో కోరారు.

డీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా గడప వేణు

రుద్రంగి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడప వేణుకూమార్, ప్రధాన కార్యదర్శిగా కోప్పు శ్రీధర్, జిల్లా కౌన్సిలర్లుగా గోపి, ఉపాధ్యక్షులుగా గడ్డమీది రోహిత్, మన్నాల మాధవి, కార్యదర్శులు భూక్య తిరుపతి, అల్వాల జయశ్రీ, మామిడి తిరుపతి, ఆడిట్ కమిటి చైర్మన్‌గా వసంతయ్య, సభ్యులుగా మానస, షైమద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలను డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బూర సదానంధం, ఎన్నికల అధికారి వంగ తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు.

వైద్యుడికి నివాళులర్పించిన సిబ్బంది

చందుర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) :చందుర్తి మండల వైద్యాధికారి వేదాచారి అకాల మరణం పట్ల మండల వైద్య సిబ్బంది గురువారం విచారం వ్యక్తం చేస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండలంలో చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ వైద్య సిబ్బంది కన్నీటి పర్యంతమయ్యారు.

గిరిజనుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

కోనరావుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందిరా గిరి సోలార్ జల వికాస్ గిరిజనులకు లాభదాయకంగా ఉంటున్నదని లంబాడిల ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానోత్ నరేష్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. గిరిజన సంఘాల నాయకులతో కలిసి ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకంను రాజన్న సిరిసిల్ల జిల్లాలో కూడా పైలెట్ ప్రాజెక్టులో భాగంగా లబ్ధిదారులను గుర్తించాని లంబాడీల కోరారు. జిల్లా నాయకులు ఇస్లావత్ రాజు నాయక్, అజ్మీరా అమృత్ లాల్, దేశాయ్, అజ్మీరా మదన్ నాయక్, తిరుపతి నాయక్‌లు పాల్గొన్నారు.

ఇసుక రవాణాదారులతో సమావేశం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుక రవాణాదారులతో తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు గురువారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ సుజాత, ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో ఇసుక తరలింపుపై అవగాహన కల్పించారు. ఇటీవల వెంకటాపూర్ గ్రామశివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తరలించేందుకు ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వడంతో గ్రామ రైతులు అడ్డుకున్నారు. దాంతో స్థానిక అవసరాలకు ఇసుక కొరత ఏర్పడింది. స్పందించిన అధికారులు పదిర మానేరు వాగు నుంచి ఇసుక రవాణాకు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో గ్రామ రైతులు తమ వాగు నుంచి ఇసుకను తరలించేందుకు అంగీకరించబోమని అడ్డుకోవడం సమస్య మారింది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక తరలింపును అడ్డుకోవద్దని తహసీల్దార్ సుజాత, ఎస్ఐ రమాకాంత్ స్పష్టం చేశారు. తమ గ్రామాల నుంచి ఇసుకను తీయబోనియమంటూ వెంకటాపూర్, పదిర రైతులు, రవాణాదారులు చెప్పగా, విషయాన్ని ఉన్నతాధికారులకు వివరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

గ్రామీణ విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్, ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఆది శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులు జాతీయ స్థాయిలో అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని దుంపేటి లాస్య ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థిని లాస్యకు ల్యాప్‌టాప్, బంగారు పతకం, ప్రశంసా పత్రాన్ని వేములవాడలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు అన్నింటా ముందుండాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడం అభినందనీయమని అన్నారు. పట్టుదల, ప్రణాళికబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆకాంక్షించారు. విద్యార్థిని జాతీయ స్థాయిలో నిలవడం అభినందనీయమని పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం అన్నపూర్ణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ రాంబాబులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, పాఠశాల డీన్ విజయ్‌కుమార్, రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈసారి మిగులు లేదు..

5వ పేజీ తరువాయి..

దొడ్డుబియ్యంతో అన్నం వండుకోవడానికి తీసుకొని వెళితే, మరి కొందరు పిండి వంటల కోసం వాడుకునే వారు. మిగతా వారు దళారులకే బియ్యాన్ని అమ్మి డబ్బులు తీసుకునే పరిస్థితి ఉండేది. అయినప్పటికీ రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం మిగిలిపోయేవి. ఇలా మిగిలిన బియ్యం లెక్కల ఆధారంగా మిగులు కలుపు కొని బియ్యం సరఫరా చేసేవారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో దాదాపు 4,716 క్వింటాళ్ల బియ్యం మిగిలేది. మిగులు దొడ్డు బియ్యంలో బోయినపల్లి మండలంలో 32,891కిలోలు, చందుర్తిలో 23,501, గంభీరావుపేటలో 25,207, ఇల్లంతకుంట 37,144, కోనరావుపేట 40,718, ముస్తాబాద్ 31,658, రుద్రంగి 11,793, సిరిసిల్ల 1,07,436, తంగళ్లపల్లి 28,445, వీర్నపల్లి 12,133, వేములవాడ 64,869, వేములవాడ రూరల్ 21,608, ఎల్లారెడ్డిపేట 34,226 కిలోల బియ్యం మిగులుగా ఉండేది. ప్రస్తుతం ఈ బియ్యాన్ని ఆయా రేషన్ దుకాణాల్లోనే సీజ్ చేశారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌లోగల మూడు ప్రైవేటు ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిరీషా, వాణి, సిరి ఆసుపత్రుల్లో ఫైర్‌ఆఫీసర్ నరేందర్ ఆధ్వర్యంలో ఫైర్‌సేఫ్టీ నిబంధనలు ఎలా పాటించాలనే అంశంపై నిర్వాహకులు, సిబ్బందికి తెలియజేశారు.

పాఠశాల వార్షికోత్సవం


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

చందుర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జలంధర్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు జితేందర్, అనిత, కర్ర శ్రీధర్, సంపతి రమేష్, బానోతు రాజు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రైతు భరోసా ఇవ్వాలి

చందుర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతులకు పూర్తిస్థాయిలో రైతు భరోసా ఇవ్వాలని చందుర్తి మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలుక పెంటయ్య అన్నారు. మండల కేంద్రంలో రైతు సంక్షేమ సంఘం నాయకులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ గతంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు నిర్వహించినప్పుడు బస్తాకు 41కిలోల 600గ్రాములు తూకం వేసేవారని ప్రస్తుతం ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో బస్తాకు 42 కిలోల ధాన్యం తూకం వేస్తున్నారన్నారు. ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని రైతులను దోచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం నాయకులు చంటి బాబురావు, గాజుల సత్తయ్య నాగరాజు, వట్టెంల కనకయ్య, దుద్యాల లచ్చిరెడ్డి, సుధాకర్, చింతం లక్ష్మీరాజ్యం, ఎగుమామిడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కుట్ర రాజకీయాలు మానుకోవాలి : కాంగ్రెస్

గంభీరావుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కుట్ర రాజకీయాలను బీఆర్ఎస్ నాయకులు ఇకనైనా మానుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ పేర్కొన్నారు. గంభీరావుపేటలో గురువారం మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కావాలనే గొడవ సృష్టించారన్నారు. మహిళ చైర్ పర్సన్ విజయపై దుర్భాషలాడుతూ అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. గూండాగిరి చేసింది. గొడవకు కారణమైంది బీఆర్ఎస్ నాయకులేనని పేర్కొన్నారు. మరోసారి ప్రభుత్వ పనులకు అడ్డుతగిలితే ఊరుకునేది లేదని వెల్లడించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వ పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్నామని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను జీర్ణించుకోలేకనే బీఆర్ఎస్ ఉనికి కోసం ఈ కుట్ర రాజకీయాలను ప్రోత్సహిస్తోందన్నారు.

ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తన మార్చు కోవాలని లేని పక్షంలో మా కాంగ్రెస్ శ్రేణులు తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని హన్మండ్లు, హమీద్‌లు హెచ్చరించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ, వైస్ చైర్మెన్ అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు శంకర్, వెంకటి, ప్రవీన్, ప్రభాకర్, భాస్కర్, బాలయ్య, రాజుగౌడ్, లింగం తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో రౌడీ రాజ్యం, రాక్షస పాలన : బీఆర్ఎస్

గంభీరావుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రౌడీ రాజ్యం, రాక్షస పాలన అమలవుతోందని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆరోపించారు. గంభీరావుపేటలో తోట ఆగయ్య మాట్లాడుతూ ప్రజా పాలనను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల, విద్యార్థుల పట్ల వివక్ష చూపుతూ దౌర్జన్యంగా వ్యవహరిస్తోందన్నారు. దౌర్జన్యపూరిత వాతావరణం ముఖ్యమంత్రి నుంచి మొదలు పెడితే గ్రామ స్థాయి, వార్డు స్థాయి కాంగ్రెస్ నాయకులు గూండాల్లా వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, సాధించిన రాష్ట్రాన్ని దేశంలోనే ప్రగతిపథంలో గొప్ప రాష్ట్రంగా అగ్రగామిగా తీర్చిదిద్దిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రొటోకాల్ పరంగా ఫొటో పెట్టకపోవడం కక్ష సాధింపు చర్యే అవుతుందన్నారు. కొందరు అధికారులు కూడా కాంగ్రెస్ నాయకులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గంభీరావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ప్రొటోకాల్‌పై ప్రశ్నిస్తే మా పార్టీ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు తమ వైఖరి మార్చుకోవాలని, లేనిపక్షంలో చర్యకు ప్రతి చర్య ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, పట్టణ శాఖ అధ్యక్షుడు వెంకటి, మండల ప్రధాన కార్యదర్శి గంద్యాడపు రాజు, మాజీ ఎంపీటీసీ లింగమ్‌యాదవ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చక్రపాణి, మాజీ జడ్పీటీసీ లక్ష్మన్‌రావు, మాజీ ఎంపీపీ శరత్‌రావు, రమేష్, కొమ్ము బాలయ్య, వరుస కృష్ణహరి, గుండారం కృష్ణారెడ్డి, అభిలాష్, కమలాకర్ తదితరులు ఉన్నారు.

ప్రజాసంఘాల నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడుభూములకు గత ప్రభుత్వం పట్టాలను అందించి ఆదుకోవాలంటూ చేపట్టిన పోడు భూముల పోరాటంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రజా సంఘాలకు చెందిన మల్లారపు అరుణ్‌కుమార్, జూలపల్లి మనోజ్‌కుమార్‌లు మాట్లాడుతూ పోడు రైతుల పక్షాన నిలబడిపేదలకు పోడు భూముల హక్కు పత్రాలను ఇవ్వాలని న్యాయమైన డిమాండ్‌తో పోరాడిన ప్రజాసంఘాల నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేసి కోర్టుల చుట్టు తిప్పించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. పోడు రైతుల పక్షాన నిలబడిన ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గత 50 సంవత్సరాల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ భూమిలేని నిరుపేదల కుటుంబాల కు ప్రభుత్వం వెంటనే సాగు చేసుకునే అవకాశంకల్పించి హక్కు పత్రాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోడు రైతులకు హక్కు పత్రాలను ఇవ్వకపోతే ప్రజాసంఘాల అధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఇసంపెల్లి కొంరయ్య, జింక పోషయ్య, గుర్రపు నరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

బోయినపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుంద్రపల్లి, కోరెం, మల్కాపూర్, రత్నంపేట, దేశాయిపల్లి, మానువాడ, మల్లాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను బోయిని ఎల్లేష్ యాదవ్ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, మండల శాఖ అధ్యక్షుడు వెన్నెల రమణరెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం..

కోనరావుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. కోనరావుపేట మండలంలోని సుద్దాల, పల్లిమక్త గ్రామాల్లో కొలనూరు సింగిల్ విండో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొలనూరు సింగిల్ విండో చైర్మన్ సంకినేని రామ్మోహన్‌రావు, వైస్ చైర్మన్ కాశవేని మహేష్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, పన్నాల లక్ష్మరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నాయిని ప్రభాకర్‌రెడ్డి, రైతులు ఉప్పుల శంకర్, కుంటెల్లి రాజయ్య, మల్లయ్య, సుంకరి పరుశరాములు, కనక సిద్దిరాజు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారం తీసుకోవాలి

- జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం


రుద్రంగిలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో నటరాజ్

తంగళ్లపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సమతుల్య ఆహారం పిల్లలు, స్త్రీలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం సూచించారు. గురువారం తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లి గ్రామంలో జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల, జాతీయ సేవా పథకం విభాగం, జిల్లా శిశు మహిళా సంక్షేమ శాఖలు సంయుక్తంగా పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో 34 శాతం పిల్లలు పోషక లోపంతో బాధపడుతున్నారని వివరించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ నిర్వాహకులు డాక్టర్ మాధవి మాట్లాడుతూ వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు పండ్లు రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకోవాలని సూచించారు. తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి పిల్లలకు 5 సంవత్సరాలు నిండేవరకు పోషకాలతో నిండిన ఆహారం తీసుకోవడం ముఖ్యమని వివరించారు. డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే మనం తీసుకునే ఆహారంతో పాటు మన ఆలోచనలు చాలా ముఖ్యం అని అన్నారు. కరోనా తర్వాత ఆహారపు అలవాట్లని మార్చుకోవలసిన అవసరం ఉందని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ హిందూజా, రాజన్న సిరిసిల్ల జిల్లా చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉమారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంధ్యరాణి, అంగన్‌వాడీ అధికారులు, పాఠశాల విద్యార్థులు, గృహిణులు, బాలింతలు, గర్భిణులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని బావుసాయిపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడ కార్యక్రమం గురువారం నిర్వహించారు. సూపర్‌వైజర్ గంగలక్ష్మి మాట్లాడారు. గర్భిణులకు సీమంతాలు కార్యక్రమం, ఆరు నెలల నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం, అంగన్వాడి స్కూల్‌కి వచ్చే పిల్లలకు ప్రీస్కూల్ మేళా నిర్వహించారు. పంచాయతీ సెక్రెటరీ రాధిక, అంగన్‌వాడీ టీచర్లు మాధవి, కనకలక్ష్మి, వెంకటరమణ దేవి, ఆశాలు బాబాయ్, రమణ, అంగన్‌వాడీ ఆయాలు పోషవ్వ, ఉమా పాల్గొన్నారు.

● రుద్రంగి : పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, అప్పుడే ఆరోగ్యవంతంగా ఎదుగుతారని ఎంపీడీవో నటరాజ్ అన్నారు. రుద్రంగి మండలం దెగవాత్ తండా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ఆహార పదార్థంలో ఎలాంటి పోషకాలు ఉంటాయె వివరించారు. బరువు తక్కువ ఉన్న చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పిల్లల బరువును, ఎత్తును చూసి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మమత, అంగన్‌వాడీ టీచర్‌లు కోమిరె మంజుల, గడప జ్యోతి, అంబటి సరిత, తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : చిన్నారులకు ముర్రుపాలే ఆరోగ్యదాయకమని మండలంలోని పోతుగల్ ఐసీడీఎస్ అంగన్‌వాడీ కార్యకర్త భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు, తల్లులకు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పాలు, గుడ్లు, క్రమం తప్పకుండా తీసుకోవాలని, పండ్లు, ఫలాలను తినాలని కోరారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే పండంటి బిడ్డకు జన్మనిస్తున్నారని పుట్టిన బిడ్డకు ఆరగ్యోంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తల్లులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

- సిరిసిల్లలో పోస్టర్‌లను ఆవిష్కరించిన నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఐదవ మహాసభలను విజయవంతంచేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండెల్లి కళ్యాణ్‌కుమార్, మల్లారపు ప్రశాంత్‌లు కోరారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువా రం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను నాయకులతో కలి సి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు ఈనెల 25, 26, 27 తేదీల్లో ఖమ్మం జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని అన్నారు. మహా సభకు విద్యార్థులు, నాయకులు, మేధావులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సామల్ల సాయి, భరత్, కడారి శివ, నాయకులు శ్రీధర్, రాబిన్సన్, సాయి, చరణ్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'రాజీవ్ యువ వికాసం' ఇంటర్వ్యూలు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) రాజీవ్ యువ వికాసం పథక లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 19నుంచి మండలపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శశికళ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19న ఎస్‌బీఐ ఆధ్వర్యంలో గాలిపెల్లి, వంతడుపుల, తాళ్ళపెల్లి, పత్తికుంటపల్లె, ముస్కానిపేట, రేపాక, తాళ్ళల్లపల్లె, సోమారంపేట, వెంకట్రావుపల్లె, గొల్లపల్లె, కేసన్నపల్లె, ఆరెపల్లి గ్రామాలు ఉంటాయి. 22న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఆధ్వర్యంలో పొత్తూరు, కందికట్కూర్, నర్సక్కపేట, జవారిపేట, కిష్టరావుపల్లె, వల్లంపట్ల, ఒబులాపూర్, వెల్జీపూర్, గూడెపుపల్లి, అనంతగిరి, అనంతారం, రంగపేట గ్రామాలు, 23న పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆధ్వర్యంలో పెద్దలింగాపూర్, రామోజిపేట, చిక్కుడువానిపల్లె, దాచారం, రహీంఖాన్‌పేట, సిరికొండ, తిప్పాపూర్, జంగమరెడ్డిపల్లె, బోటిమీదిపల్లె, ఇల్లంతకుంట, తెనుగువానిపల్లె గ్రామాల్లోని రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులు హాజరుకావాలని కోరారు.

● చందుర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రాజీవ్ యువ వికాసం పథకం కోరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తూ చేసుకున్న దరఖాస్తుదారులకు ఈనెల 17 నుంచి 29 వరకు గ్రామాల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 మర్రిగడ్డ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, ఈనెల 19 లింగంపేట, జోగాపూర్, 21న చందుర్తి, రామన్నపేట, 22 మల్యాల, కట్టాలింగంపేట, కొత్తపేట, 23న బండపల్లి కిష్టంపేట, ఆశీరెడ్డిపల్లి, తిమ్మాపూర్, 24న నర్సింగాపూర్, మూడపల్లి, 25న సనుగుల, రామారావుపల్లి, దేవునితండా ,ఎనగల్, 28 అనంతపల్లి గామాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏదైనా అనివార్య కారణాలతో హాజరుకాని వారు 28న హాజరు అగుటకు చివరి అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సీనియారిటీ ప్రకారం విధులు కేటాయించాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 19 నుంచి జరిగే ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణకు సీనియారిటీ ప్రకారం ఉపాధ్యాయులకు విధులు కేటాయించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పరకాల రవీందర్ కోరారు. కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో గురువారం సీనియారిటీలకు పరీక్షల్లో విధులు కేటాయించాలంటూ విద్యాశాఖ అధికారులకు టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఈ పరీక్షల నిర్వహణ కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి, ఇన్విజిలేటర్లుగా విధులు కేటాయిస్తారని ఈ విధులు విద్యాశాఖ ఆధ్వర్యంలో సీనియారిటీ ప్రాతిపాదికన జరుగుతుందని ఈసారి సీనియారిటీ పాటించకపోవడంతో పాటు కేటాయించిన విధుల్లో ఒక ఎస్‌జీటీకీ కూడా స్థానం కల్పించలేదని అన్నారు. విధులు కేటాయించిన స్కూల్ అసిస్టెంట్ విభాగంలో సీనియర్‌లను కాదని జూనియర్లకు విధులు కేటాయించడం సరైంది కాదన్నారు.

ఈ కార్యక్రమంలో కోశాధికారి అంబటి రమేష్, జిల్లా కార్యదర్శులు కోటగిరి లక్ష్మణ్, కోత్వాల్ ప్రవీణ్, పాముల స్వామి, తదితరులు పాల్గొన్నారు.